వలంటీర్లపై టీడీపీ విషప్రచారం తగదు

- దేశంలోనే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలు
- లబ్ధిదారులకు సకాలంలో సంక్షేమ పథకాల పంపిణీ
- కరోనా సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి
- అక్కసుతోనే టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్లపై టీడీపీకి వత్తాసు పలికే ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం సాయంత్రం తన నివాసంలో వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకొర సంక్షేమ పథకాలు అందించేందుకు ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు అవినీతి అక్రమాలకు నిలయాలుగా మారాయని, దీంతో అసలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ఈ విషయం ప్రజలకందరికీ తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేందుకు వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని వివరించారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల ఎంపిక నుంచి సంక్షేమ పథకాల నగదును నేరుగా వారి బ్యాంకు అకౌంట్లకే జమచేస్తున్నారన్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్లపై చంద్రబాబునాయుడు, ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. కేవలం తమ సామాజిక వర్గానికి చెందిన నేత చంద్రబాబునాయుడును మళ్లీ సీఎం చేయడం కోసం విషపు రాతలు రాయడం ఆక్షేపనీయమన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను అవమానపరిచేలా చంద్రబాబునాయుడు మాట్లాడటం పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఎల్లోమీడియా, ప్రతిపక్ష నేత చంద్రబాబు తమ తీరు మార్చుకోవాలని హితవుపలికారు. వలంటీర్లు, గృహ సారథులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలపై విమర్శలు తగదు


మాట్లాడుతున్న మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన

ఆస్పరి: ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తూ వారి మన్ననలు పొందుతున్న వలంటీర్ వ్యవస్థపై ఎల్లో మీడియా దిగజారుడు కథనాలు ప్రచురించడం తగదని మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య అన్నారు. శుక్రవారం ఆస్పరి సొసైటీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. అర్హత ఉన్న వారికి ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై తప్పుడు ప్రచారం మంచిది కాదన్నారు. ప్రతి నెలా 1వ తేదీన తెల్లారకముందే అవ్వా, తాతల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను అందిస్తున్నట్లు గుర్తుచేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోపిడీ చేశారని విమర్శించారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

విషం చిమ్మడం మానుకోవాలి


మాట్లాడుతున్న ఆలూరు ఎంపీపీ శ్రీరాములు

ఆలూరు: అర్హత ఉన్న లబ్ధిదారులకు సకాలంలో ప్రభు త్వ పథకాలు అందిస్తున్న గ్రామవలంటీర్లపై పచ్చ మీ డియా ఇష్టానుసారంగా పిచ్చిరాతలు రాయడం, విషం చిమ్మేలా కథనాలు ప్రచురించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్షేపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీరేష్, ఎంపీపీ శ్రీరాములు, నాయకులు ఈరన్న,మాదన్న,రాంభీమ్‌నాయుడు తదితరులు మా ట్లాడుతూ వలంటీర్లసేవలను గుర్తించి ఇతర రాష్ట్రాలు సైతం ఆ దిశగా కృషి చేస్తున్నాయన్నారు. వలంటీర్ల మనోభావాలను దెబ్బతినేలా పచ్చ పార్టీకి చెందిన ప త్రికల్లో దిగజారుడు రాతలు మానుకోవాలన్నారు.ఇతరులను కించపరిచేలా చౌకబారు ప్రకటనలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు


పత్తికొండలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు

పత్తికొండటౌన్: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థపై ఎల్లోమీడియాలో అవాస్తవ కథనాలు ప్రచురించడం బాధాకరం అని పత్తికొండ ఎంపీపీ ఎం.నారాయణదాసు అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా పనిచేస్తున్నారన్నారు. వలంటీర్లు సేవాభావంతో పనిచేస్తున్నారని, పార్టీకి, వారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారని వారే పార్టీ గెలుపు కోసం పనిచేస్తారన్నారు. ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని, అవాస్తవ కథనాలను ప్రచురించడం వంటి కుట్రలు చేస్తే ప్రజల్లో మరింత చులకన అవుతారని హితబోధ చేశారు.

క్లుప్తంగా

ముగిసిన మునిస్వామి ఉరుసు


నల్లగుండ్లలో షంషీర్ ఊరేగింపు చేస్తున్న భక్తులు

తుగ్గలి: నల్లగుండ్లలో నిర్వహిస్తున్న మునిస్వామి ఉరుసు శుక్రవారం ముగిసింది. వేకువజామున పూలతో అలంకరించిన స్వామి షంషీర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో ఊరేగింపు చేసి దర్గాకు తీసుకెళ్లారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామికి కొబ్బరికాయలు కొట్టి తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు.

చెన్నంపల్లిలో గంధోత్సవం..

చెన్నంపల్లిలో సవాసప్ప స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు మేళతాళాలతో గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గోనెగండ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ బీపీ మంజునాథ్ హెచ్చరించారు. శుక్రవారం కున్నూరు గ్రామంలో ఎస్‌ఐ ఎం.తిమ్మారెడ్డితో కలిసి సీఐ పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని రూరల్ సీఐ బీపీ మంజునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కోటేకల్ మజరా గ్రామం కె.నాగలాపురంలో రూరల్ సీఐ మంజునాథ్, ఎస్‌ఐ సునీల్‌కుమార్‌లు పల్లె నిద్ర నిర్వహించారు.

హొళగుంద: గ్రామాలలో అసంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో ఆయన పల్లెనిద్ర చేశారు.

సచివాలయాల తనిఖీ

నందవరం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను, సంక్షేమ క్యాలెండర్లను పరిశీలించారు. సేవల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్ జెరిమ్మియా, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రధాన ప్రతిపక్షంగా టీడీపీ విఫలం

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ వైఫల్యాలపై స్పందించని తెలుగుదేశం పార్టీ ఎమ్మిగనూరులో ఉన్నట్టా? లేనట్టా? అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఆర్.మురహారరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ జయన్నకు వినతి పత్రం అందచేశారు. మురహరరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో తెలుగుదేశం పార్టీ తమ ఉనికి కోసం కార్యక్రమాలు చేస్తుంటే, ప్రతిపక్ష పాత్రను బీజేపీ పోషిస్తోందన్నారు. రాబోవు రోజుల్లో ఎమ్మిగనూరుకు బీజేపీ పెద్దదిక్కుగా మారబోతుందని తెలిపారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడామైదానంలో శుక్రవారం వాలీబాల్ అండర్–17 శిక్షణ శిబిరాన్ని పత్తికొండ డివిజన్ సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలులో ఈనెల 23 నుంచి జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ రమేష్‌బాబు, కోచ్‌లు వేణుగోపాల్, మధుబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసర్వే వేగవంతం చేయండి

మద్దికెర: భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. ఆయన శుక్రవారం మండలంలో జరుగుతున్న భూసర్వే పనులు పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాలలో రైతుల వద్ద ఉన్న రికార్డులతో పాటు ప్రభుత్వ రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

సేవలు విస్తృతం చేయండి


ఐరన్‌బండ గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి బాలకృష్ణారెడ్డి

ఆలూరు: సచివాయాల సేవలను విస్తృతం చేయాలని నోడల్ అధికారి బాలకృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల, ఐరన్‌బండ, మాచాపురం, తెర్నెకల్, నెల్లిబండ, తదితర గ్రామ సచివాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని సర్వీసులను అందించాలన్నారు. విధి నిర్వహనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ


జెర్మియా

నందవరం: నందవరం మండల ఆర్‌ఐగా జెర్మియా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మిగనూరు రెవెన్యూ కార్యాలయం నుంచి ఆయన నందవరానికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

చిప్పగిరి: పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాలు దూరంగా ఉంటాయని ఈఓపీఆర్డీ సంజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు రోడ్డుపైకి వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రీసర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల పక్షాళన పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే చేపట్టి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. మండలంలోని 15 రెవెన్యూ గ్రామాలకుగాను మొదటి విడత కింద 9 గ్రామ పంచాయతీల పరిధిలో సర్వే చేపడుతున్నామన్నారు. డీటీ రామలక్ష్మి, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ మస్తాన్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈనెల 21న శనివారం వెల్దుర్తి టౌన్, గోవర్ధనగిరి సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కలుగొట్ల, రామళ్లకోట సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మండల అధికారి రాఘవేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

తుగ్గలి: సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా తుగ్గలి, మద్దికెర మండలాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఆధార్ అనుసంధానం చేపట్టండి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకంలో పని చేసే ప్రతి కూలీకి సంబంధించి జాబ్‌కార్డులో ఉన్న అందరికీ ఆధార్‌ను అనుసంధానం చేపట్టాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 12 వేల జాబ్‌కార్డులకు సంబంధించి ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు బాధ్యత తీసుకుని కూలీల ఆధార్‌లను సేకరించి కార్యాలయంలో నమోదు చేయించాలని సూచించారు. ఆధార్ నమోదు వంద శాతం పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన

ఆలూరు: పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. దేవనకొండ మండలం మాచాపురం గ్రామంలో రైతులు సాగుచేసిన చీని, జామ పండ్ల తోటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఓ కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఆస్పరి: ఆస్పరికి చెందిన మహానందమ్మకు శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలను సర్పంచ్ మూలింటి రాధమ్మ అందజేశారు. ఐదు రోజులు క్రితం బొల్లూరు వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైనట్లు ఈఓ రామాంజినేయులు తెలిపారు. మిగతా బీమా సొమ్ము బాధితురాలి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు.

సారా తరలిస్తున్న మహిళల అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని రత్నపల్లె క్రాస్ వద్ద శుక్రవారం సారా తరలిస్తున్న ఇరువురు మహిళలను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం తా ము, వెల్దుర్తి పోలీసులు జరిపిన సంయుక్త దా డులలో వెల్దుర్తికి చెందిన సుంకులమ్మ, బోయ లక్ష్మీదేవి 20 లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులను డోన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి


హౌసింగ్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, హౌసింగ్ పీడీ

ఎమ్మిగనూరు టౌన్: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణాలు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు సొంత స్థలాలు ఉండి ఇళ్లను నిర్మించుకునే వారి నుంచి గృహాల మంజూరుకు దరఖాస్తులు తీసుకోవాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన నివాసంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణతో కలిసి హౌసింగ్ డీఈ, ఏఈలతో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో 7,410 గృహనిర్మాణాలు మంజూరైనట్లు ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. వాటిలో నిర్మాణాలకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు 2,365 గృహాలను బేస్‌మెంట్ స్థాయిలో నిర్మించుకోగా మిగిలిన 2,566 గృహాలు లెంటల్ , రూఫ్, ఆర్‌సీ స్థాయిల్లో నిర్మాణాలుండగా 841 గృహాలు పూర్తయినట్లు వారు వివరించారు. గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మాణాలు చేసుకొనేందుకు ముందుకు వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని హౌసింగ్ పీడీ కోరారు. సమావేశంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈలు తిలక్‌కుమార్, రామచంద్ర, లక్ష్మన్న, గురుస్వామిలు పాల్గొన్నారు.

'వారు నా భూమే ఆక్రమించారు'

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీ వద్ద భూఆక్రమణకు పాల్పడ్డ వారితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్పష్టం చేశారు. తనకు కొడుకు వరుస అయిన వారే గతంలో తన భూమిని ఆక్రమించుకున్నారని అలాంటి వారిని ఎప్పుడో దూరం పెట్టానని చెప్పారు. మైనారిటీ కాలనీ వద్ద గురువారం భూ ఆక్రమణ ఘటనలో రైతులు ఆత్మహత్యకు ప్రయత్నించడంపై తనకు గాని, కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. భూ ఆక్రమణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారని బాధితులకు న్యాయం జరిగేలా అన్నివిధాలుగా సహకారం అందిస్తామన్నారు. దౌర్జన్యాలకు, భూఆక్రమణలకు తాను వ్యతిరేకమన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాసు

పత్తికొండటౌన్: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అందరూ కృషిచేయాలని ఆర్డీఓ మోహన్‌దాసు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు మోటార్ బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీఐ రామకృష్ణారెడ్డి, ఎంవీఐ దీప్తి ప్రారంభించారు. కళాశాలలో జరిగిన సమావేశంలో ఆర్డీఓ మోహన్‌దాసు మాట్లాడుతూ వాహ నదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యం అని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామం ఊరి బయట మిట్టసోమపురం రోడ్డులో ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటాక మద్యం తరలిస్తున్నారనే సమాచారం అందడంతో ఎస్‌ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి బైక్ పట్టుకున్నారు. నిందితుడు రాయచోటి గ్రామానికి చెందిన మల్లెపోగు ఏలీసా నుంచి కర్ణాటక మద్యం ఒరినల్ ఛాయస్ విస్కీ 1056 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మినీ లారీ బోల్తా


బోల్తా పడిన కొబ్బరి బోండాల లోడు లారీ

వెల్దుర్తి: మైసూర్ నుంచి కర్నూలుకు కొబ్బరి బోండాల లోడ్‌తో వెళ్తున్న మినిలారీ (ఐచర్) శుక్రవారం ఉదయం హైవే–44పై లిమ్రాస్ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. గద్వాల జిల్లాకు చెందిన డ్రైవర్ రవితోపాటు అందులో ప్రయాణిస్తున్న టెంకాయల ఓనర్ వనపర్తికి చెందిన శివ గాయపడ్డారు. మరో ఓనర్ పెబ్బేరుకు చెందిన ఎల్లస్వామి క్షేమంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను హైవే పోలీసులు అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టీబీ డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం


తుంగభద్ర రిజర్వాయర్

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ఈ ఏడాది ముందస్తు వర్షాల కారణంగా టీబీ డ్యాం ముందుగానే నిండడంతో జూలై నుంచి డ్యాం గేట్లు ఎత్తిన టీబీ బోర్డు అధికారులు దాదాపు మూడున్నర నెలల పాటు కొనసాగించారు. గత కొద్ది రోజులుగా నీటి నిల్వ క్రమేణా తగ్గుతూ వస్తుంది. ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుంటే 9,228 క్యూసెక్కుల నీటిని కాలువలకు (ఔట్‌ఫ్లో) వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గడంతో అక్టోబర్ 26న గేట్లన్నీ మూసివేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 1వ తేదీ నాటికి ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుగా నమోదు కావడం , సాగు, తాగుకు డిమాండ్ పెరగడంతో రోజుకు ఒక టీఎంసీ మేర నీరు ఖాళీ అవుతోంది. 75 టీఎంసీల నీరు నిల్వ ఉంటే 20వ తేదీకి 60 టీఎంసీలకు పడిపోయింది. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగ శుక్రవారం ఉదయానికి 1619.59 అడుగులతో 60.187 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1626.99 అడుగుల వద్ద 79.366 టీఎంసీల నీరు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 1,510 క్యూసెక్కులు ఉండేది. ఇక ఎల్లెల్సీకి ఏప్రిల్ 5వ తేదీ వరకు నీటిని విడుదల చేసేందుకు టీబీ బోర్డు అధికారులు ఇటీవలే జరిగిన ఇరు రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఎల్లెల్సీ ఆంధ్రా పరిధి కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 532 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

వ్యక్తి దుర్మరణం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెండ్లిమాన్‌తండా బస్టాండు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్రిమాన్‌తండాకు చెందిన గోవిందునాయక్ (34) శుక్రవారం దుర్మరణం పాలయ్యాడు. డోన్‌లో కోళ్ల ఫారం నిర్వహిస్తున్న గోవిందునాయక్ ఉదయం స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ముక్కెళ్ల గ్రామానికి వెళ్తున్న విద్యార్థి బస్సును ఎదురెదురుగా ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య పార్వతిదేవి, ఇద్దరు కుమారులు సాయిరాం, హర్షవర్దన్ ఉన్నారు.

రిజర్వాయర్ పనుల తనిఖీ


నగరదోణ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆలూరు: చిప్పగిరి మండలం నగరడోణ గ్రామ సమీపంలో ఎగువ కాలువపై రూ 53.82 కోట్లతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను శుక్రవారం హెచ్‌ఎల్‌సీ ఈఈ రమణా రెడ్డి, క్వాలిటీ కంట్రోలర్ ఈఈ నరసింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు కట్టకు రింగ్‌బండ్, డీపీలు, ఎర్త్ బండ్ మొత్తం పొడవు, నీటి నిల్వ సామర్థ్యం, కట్ట ఎత్తు పనులు, కాలువలు తదితర పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కేజీటీ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. వచ్చే ఖరీఫ్, రబీ సీజన్ నాటికి ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రయత్నిస్తామని హెచ్‌ఎల్‌సీ ఈఈ రమణారెడ్డి, డీఈ మంజునాథ్ గౌడ్ తెలిపారు. జేఈ తిమ్మారెడ్డి, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

సంప్రదాయానికి ప్రతీక బండలాగుడు పోటీలు

తుగ్గలి: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బండలాగుడు పోటీలు అని నునుసరాల్ల సర్పంచ్ దారెడ్డి రామలక్ష్మమ్మ, గౌరవ సలహాదారు దారెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. మునిస్వామి ఉరుసు సందర్భంగా నల్లగుండ్లలో ఏర్పాటు చేసిన రాతి దూలం లాగుడు పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోటీల్లో పాణ్యం మండలం ఎస్ కొత్తూరు బీరం సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఎద్దులు విజేతగా నిలిచాయి. ఆ తర్వాతి స్థానాల్లో నంద్యాల జిల్లా తుమ్మలూరు టి.పల్లవి, రఘురెడ్డి ఎద్దులు, డి రంగాపురం జె.రామచంద్రారెడ్డి ఎద్దులు, ఎస్.కొత్తూరు సుబ్రమణ్యేశ్వరరెడ్డి, పెండేకల్లు నాగభూషణం ఎద్దులు, యల్లనూరు మండలం చెలమకూరు రమాదేవి ఎద్దులు నిలిచాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు వరుసగా బహుమతి దాతలు దారెడ్డి గోపాల్‌రెడ్డి రూ.40,016, ఎంకే కొట్టాల శెట్రజ కాశీం, కమాల్ వలి కలిపి రూ.30,016, లొద్ద మారెల్ల కిష్టప్ప రూ.20,016, మారెల్ల వడ్డె మునిస్వామి రూ.10,016, నల్లగుండ్ల కురువ శ్రీకాంత్ రూ.5,016 అందజేశారు.

సర్వే వేగవంతం చేయండి

హొళగుంద: ఆయుష్మాన్ భారత్ సర్వేలో వెనుకబడి ఉన్నామని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్లక్ష్యం వీడి వేగవంతం చేయాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ఆయుష్మాన్ భారత్ సర్వేలో వెనుకబడడానికి సంజాయిషీ ఇవ్వాలని కోరారు. విధుల్లో అలసత్వం వహించడం, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వలసలు నివారించేలా ఉపాధి పనులు


బోదెపాడులో ఫీడర్ ఛానల్ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

గోనెగండ్ల: వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా గ్రామాల్లో కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని బోదెపాడు గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వలస వెళ్లకుండా ఉండేందుకు గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలందరూ ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. అలాగే ఉపాధి పనుల్లో రోజుకు కనీస వేతనం రూ.257 పడేటట్లు పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కేటాయించిన లక్ష్యానికి మించి పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ బొజ్జయ్య, ఈసీ ఉస్మాన్ బాషా, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

పత్తికొండటౌన్: పన్నుల వసూళ్లను వేగవంతం చేసి మార్చి నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొమ్ము దీపిక, గౌరవ సలహాదారు ఎస్.నాగరత్నమ్మ, ఉప సర్పంచ్ పల్లె కళావతి, ఈఓ నరసింహులు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కార్మికుల వేతనాలు, పట్టణంలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు చేపట్టాలంటే నిధులు అవసరమన్నారు. ఇంటి, కొళాయి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


నదికైరవాడిలో వరి నాట్లపై రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

నందవరం: రైతులు వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. శుక్రవారం నదికైరవాడి గ్రామంలో వరి సాగుపై క్లస్టర్ స్థాయి 'వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వరినాటు వేసిన తరువాత 2 మీటర్లకు 20 సెం.మీ కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాటలు తీయడం ద్వారా గాలి, వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి తగ్గుతుందన్నారు. చదరపు మీటరుకు 66 మొక్కలు నాటుకోవాలని సూచించారు. తద్వారా మొక్కకు భూమిలోని పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. ఏఓ మద్రి స్రవంతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.